క్లుప్తంగా

విజయవంతమైన వేసవి బడి



కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో సోమవారం వేసవి బడిని విజయవంతంగా ముగించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్ మాట్లాడుతూ గత నెల 25న ప్రారంభమైన వేసవిబడి ఈ నెలరోజుల్లో విద్యార్థులు గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, చేతి రాత, డ్రైయింగ్, ప్రాజెక్ట్ వర్క్ తదితర అంశాలను పరిపూర్ణంగా నేర్చుకున్నారన్నారు. ఇందులో వలంటీర్ల కృషి ప్రత్యేకమైనదని వారు కొనియాడారు. కార్యక్రమంలో వలంటీర్లు శివలీల, శిరీష, అంగన్‌వాడీ టీచర్లు కవిత, వెంకటేశ్వరమ్మ, సునిత, దౌలత్‌బీ, సర్వీస్ పర్సన్ సోఫి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించాలి



నారాయణపేట రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ జాగరణ సేన జిల్లా అధ్యక్షులు కురుమయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ అమరేందర్ కృష్ణకు ఆ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని, నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. చట్ట విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాల యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని, యూనిఫామ్, పుస్తకాలు అమ్మకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, అశోక్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోండి

నర్వ: వందేమాతరం ఫౌండేషన్, భారత్ ఆర్ట్స్ లెర్నింగ్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే విద్యాసంవత్సరానికి వందేమాతరం కార్యకర్తలుగా పనిచేయుటకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్ ఆపై అర్హతలు కలిగిన వారు చదువుతున్న విద్యార్థులు, ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏ జిల్లాలో వారు ఆ జిల్లాలోని మండలాల్లో, పట్టణాల్లో, గ్రామాల్లో పని చేయుడానికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి భారత్ ఆర్ట్స్ లెర్నింగ్ అకాడమీ సంస్థ వారు ట్రెనింగ్ ఇచ్చి అర్హత సాధించిన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు 6300949477, 9392187342, 8179920338, 9550413713 నంబర్లను సంప్రదించాలన్నారు.

జోరుగా బీటీ రోడ్డు నిర్మాణం



కొత్తపల్లి: సీఎం నియోజకవర్గంలోని కొత్తపల్లి మండల పరిధిలో బీటీ రోడ్డు విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. కోటకొండ నుంచి గుండుమాల్ వరకు 14.8 కి.మీ. రహదారిని రూ.38కోట్లతో డబుల్ రోడ్డుగా నిర్మిస్తున్నారు. విస్తరణలో భాగంగా సోమవారం బీటీ పనులు ప్రారంభించారు. పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోట్ల మహేందర్ రెడ్డి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజా రవాణాకు ఇబ్బందులు కలగకుండా పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించాలని అధికారులకు తెలిపారు.

గురుకుల వసతి గృహంలో నైపుణ్య శిక్షణ

దామరగిద్ద: మండల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో గురుకులాల్లో చదివిన పూర్వ విద్యార్థులకు ఉన్నత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ అందజేస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ డిగ్రీ, గురుకుల పాఠశాలల్లో చదువుకొని ఉండి 19 నుంచి 25 సంవత్సరాల వయస్సు మధ్య వయస్సు కల్గి ఉన్న ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రహదారులు చిత్తడి చిత్తడి

- బీటీ రోడ్లు లేక ప్రజలకు ఇబ్బందులు
- వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయం
- పట్టించుకోని అధికారులు



బురదగా మారిన ఏర్గాట్‌పల్లి రోడ్డు

ఊట్కూర్: మండలంలో పలు గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం లేక మండల ప్రజలు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఏర్గాట్‌పల్లి, జీర్ణహళ్లి, వల్లంపల్లి, చిన్నపొర్ల-ఎడివెళ్లి, చిన్నపొర్ల-పులిమామిడి, నిడుగుర్తి-పెద్దజట్రం, ఊట్కూర్-అమీన్‌పూర్, ఊట్కూర్-సమస్తాపూర్, కొల్లూర్-నాగిరెడ్డిపల్లి, బాపూర్-నిడుగుర్తి తదితర గ్రామాలకు మట్టి రోడ్లు ఉన్నాయి. మట్టి రోడ్లు, మెటల్ రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. జీర్ణహళ్లి గ్రామానికి రెవెన్యూ నక్ష ప్రకారం రోడ్డు గుర్తించకపోవడంతో ప్రజలు పొలాల మధ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలం కావడంతో రోడ్లపై గుంతల్లో నీరుచేరడంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల రోడ్లకు ఇరువైపులు ముళ్లపొదలు పెరిగాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలలో వెళ్లేందుకు సైతం ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని పలు మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధుల వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

మండలంలో రోడ్లు ఇలా..

- వల్లంపల్లి, ఏర్గాట్‌పల్లి గ్రామాలకు 3కి.మీ. మెటల్ రోడ్డు ఉంది.
- జీర్ణహళ్లి గ్రామానికి 3 కి.మీ. మట్టి రోడ్డు ఉంది.
- చిన్నపొర్ల నుంచి ఎడివెళ్లి గ్రామానికి 2 కి.మీ, చిన్నపొర్ల నుంచి పులిమామిడి గ్రామానికి 3కి.మీ. మట్టిరోడ్డు ఉంది.
- పెద్దజట్రం నుంచి నిడుగుర్తి గ్రామానికి 3కి.మీ, పెద్దజట్రం నుంచి మొగ్దుంపూర్ గ్రామానికి 3కి.మీ. మట్టి రోడ్డు ఉంది.
- ఊట్కూర్ నుంచి అమీన్‌పూర్ గ్రామానికి 5 కి.మీ. మట్టి రోడ్డు ఉంది.
- ఊట్కూర్ నుంచి సమస్తాపూర్ గ్రామానికి 3కి.మీ. మెటల్‌రోడ్డు ఉంది.
- కొల్లూర్ నుంచి నాగిరెడ్డిపల్లి గ్రామానికి 2కి.మీ. మట్టిరోడ్లు ఉంది.
- బాపూర్ నుంచి నిడుగుర్తి గ్రామానికి 2కి.మీ. మట్టి రోడ్డు ఉంది.



కొత్తపల్లి రోడ్డుపై గుంతల్లో చేరిన వర్షపునీరు

బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి..



మండలంలోని చాలా గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్లు బురదమయం అవుతున్నాయి. రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లో నీరు చేరడంతో ప్రయణించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– వెంకట్రామారెడ్డి, సీపీఎం, నారాయణపేట

రోడ్లన్నీ బురదగా ఉన్నాయి..



బిజ్వార్ నుంచి కొత్తపల్లి వరకు 2కి.మీ. మట్ట రోడ్డు ఉంది. రోడ్డుపై గుంతలు పడ్డాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. గతంలో బీటీ రోడ్డు కోసం అధికారులకు, నాయకులకు చాలా సార్లు వినతిపత్రాలు ఇచ్చాం. అధికారులు స్పందించి బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలి.

– రామాంజనేయులు, కొత్తపల్లి, ఊట్కూర్

కాంప్లెక్స్ కోసం స్థలం పరిశీలన



షాంపింగ్ కాంప్లెక్స్ కోసం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి, నాయకులు

మరికల్: వృథాగా ఉన్న ప్రభుత్వ స్థలంలో షాంపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యమోహన్‌రెడ్డిలు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి సహకారంతో మరికల్‌లో షాంపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపడుతామన్నారు. ప్రస్తుతం మటన్ దుకాణాలను వ్యవసాయ గోదాం దగ్గర నిర్మించి అక్కడికి మారుస్తామన్నారు. అలాగే పాత గిర్దావరి కార్యాలయం, పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట నూతన షాంపింగ్ కాంప్లెక్స్ నిర్మించి లక్కీడిప్ ద్వారా వ్యాపారులకు అందజేస్తామన్నారు. ఇందుకు వ్యాపారులు, అఖిలపక్ష నాయకుల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో హరిష్, మల్లయ్య, రఘు, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

గురుకులాన్ని జాంద్రగుట్ట వద్దే కొనసాగించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నర్వ బీఆర్‌ఎస్ నాయకులు

నర్వ: గతంలో మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలకు కేటాయించిన నర్వ జాంద్రగుట్ట స్థలాన్ని తిరిగి కేటాయించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు బీఆర్‌ఎస్ నాయకులు వినపతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో జాంద్రగుట్ట వద్ద 40/2 సర్వేనంబర్‌లో గురుకుల పాఠశాల భవన నిర్మాణ కోసం స్థలం కేటాయిస్తూ ప్రొసిడింగ్(ఉ2/1835/2023)ను ఆనాడు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చొరవతో అధికారులు 21-8-2023 కేటాయించారన్నారు. ఇందు కోసం నర్వ గ్రామపంచాయతీలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కొందరు నాయకులు ఈ పాఠశాలను లంకాల శివారులో సర్వేనెంబర్ 330 దగ్గర కేటాయించడం జరిగిందన్నారు. ఈ బాలికల పాఠశాలను నర్వ మండల కేంద్రంలోనే కేటాయిస్తే బాలికలలకు రక్షణగా ఉంటుందని వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలకు కేటాయించిన జాంద్రగుట్ట వద్ద స్థలాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పునరాలోచన చేసి బాలికల పాఠశాలను నర్వ జాంద్రగుట్ట వద్దనే నిర్మాణం చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, నాయకులు డా.శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, కల్వాల్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కెంచె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వారు సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని కోటకొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నారని, నిజమైన పేదలకు అవి దక్క డం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పేదలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాములు, చెన్నప్ప, రామకృష్ణ, ప్రవీణ్, భగవాన్, శంకర్, రవికుమార్, నరసింహులు, బాలరాజు, సంతోష్, వెంకటేష్, నవీన్ పాల్గొన్నారు.

ఊట్కూరు: అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని బహుజన సమాజ్ పార్టీ మండల ఇన్‌చార్జి కొక్కు గౌతం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన నిరుపేదలు చాలా మంది ఉన్నారని, అధికారులు పార్టీలకతీతంగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని కోరారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అర్హులైన నిరుద్యోగులకు మంజూరు చేయాలని కోరారు.

బీసీ బిల్లు ఆమోదంపై హర్షం

దామరగిద్ద: బీసీల అభ్యున్నతికి పార్టీలన్నింటిని ఏకతాటిపైకి తెచ్చి బీసీ బిల్లును ఆమోదింప చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దామరగిద్ద మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్ మండల నాయకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించి సామాజిక ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు దోహద పడేలా బీసీ బిల్లును తేవడం సంతోషకరమని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, ఎమ్మెల్యే శ్రీహరికి అఖిలపక్ష శాసన సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు శనేశ్వరస్వామి జయంత్యుత్సవాలు

నారాయణపేట రూరల్: శనేశ్వరస్వామి జయంత్యుత్సవాలు మంగళవారం పట్టణంలోని బారం బావి శనేశ్వర దేవాలయం దగ్గర ఘనంగా నిర్వహిస్తున్నట్లు భక్తమండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు శనేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు తైలాభిషేకం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అవధూత మఠంలో అన్నదానం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎంఈఓ



కృష్ణా: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఎంఈఓ నిజాముద్దీన్, స్థానిక ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాట సన్నాహక సమావేశంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించినట్లు తెలిపారు. ప్రధానంగా గ్రామాల్లోని బడీడు పిల్లలను బడికి పంపేవిధంగా ప్రతిఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేణుక, నాగరాజు, శివరాజు, సీఆర్‌పీ అమీన్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్ కోసం స్థల పరిశీలన



మరికల్: మండల కేంద్రంలోని కోయిల్‌సాగర్ ప్రధాన కాల్వ దగ్గర ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ కోసం సోమవారం డీఆర్‌డీఓ మొగులప్ప స్థలం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ ద్వారా ముక్కలు చేసి దాని ద్వారా కొన్ని వస్తువులను తయారు చేయడం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. మరి కొన్ని స్థలాలను పరిశీలన చేసిన తర్వాత యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, ఎంపీఓ పావని, కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రభుత్వబడుల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలి



నర్వ: రాబోయే విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వబడుల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు మహిళా సంఘాలు, అంగన్‌వాడీలు కృషి చేయాలని పాథర్చేడ్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య అన్నారు. సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మహిళాసంఘాలు, అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపాధ్యాయులు సదన్‌రావు, రాములు, పీడీ విష్ణు, అంగన్‌వాడీ టీచర్ గిరిజ, లీలావతి, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- ప్రజాకవి జయరాజ్



పస్పులలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాకవి జయరాజ్

మక్తల్: అంబేడ్కర్ జీవిత పోరాటాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రజాకవి జయరాజ్ అన్నారు. సోమవారం మక్తల్ మండలం పస్పుల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కేఎన్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో కుల విభజన చాలా తీవ్ర స్థాయిల్లో ఉందని, ఆదిపత్య వర్గాలకు మేలు చేస్తుందన్నారు. సమాజంలో కులం లేని జీవితం కోరుకోవాలన్నారు. దేశంలో ఉన్న యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయ సాధన కోసం నిరంతరంగా కృషి చేయాలన్నారు.దేశాన్ని మార్చే శక్తి కేవలం అంబేడ్కర్‌కు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ డీజీ సూర్యచంద్ర, లింగన్న, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, మక్తల్ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, మానవ హక్కుల కార్యకర్త మద్దిలేటి, జిల్లా కార్యదర్శి కృష్ణ, జిల్లా జోగిని వ్యతిరేక కన్వీనర్ హాజమ్మ, విగ్రహ దాత రామచంద్ర నర్సప్ప, పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి, మాజీ సర్పంచ్ దత్తప్ప, వాసుదేవరావు, పోలప్ప, నాగేష్ పాల్గొన్నారు.

నేలను బట్టి విత్తనాల ఎంపిక చేసుకోవాలి



కోస్గిలోని ఫర్టిలైజర్స్ షాపులలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

కోస్గి రూరల్: రైతులు తమ నేల స్వభావానికి అనుగుణంగా నీటి వసతి ఆధారంగా విత్తనాలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధిక దిగుబడినిచ్చే విత్తనాలను గుర్తింపు పొందిన సంస్థల దగ్గర కొనుగోలు చేసుకోవాలన్నారు. గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని, నకిలీ విత్తనాలు కనబడితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పట్టణంలోని పలు విత్తనాలు, ఫర్టిలైజర్స్ షాపుల్లో తనిఖీ నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌లు, బిల్‌బుక్స్, ఇన్‌వాయిస్‌లు, విత్తనాల సోర్స్ సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ వినోద్, పోలీసు బృందం ఉన్నారు.

పాలిటెక్నిక్ ర్యాంకర్‌కు సన్మానం



ఐశ్వర్యను సన్మానిస్తున్న సత్యసాయి ప్రతినిధులు

కోస్గి రూరల్: సత్యసాయి సంస్థలు, పాలమూరు యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత పాలిటెక్నిక్ శిక్షణలో చదివి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థిని సమితి కన్వీనర్ విష్ణు ప్రసాద్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేద ఉన్నత పాఠశాలలో 40 రోజులుగా నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పించామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాగసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య రాష్ట్ర స్థాయిలో 90వ ర్యాంకు, నారాయణపేట జిల్లా మొదటి ర్యాంకు సాధించడం హర్షనీయమన్నారు. అనంతరం పూల మాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన కోఆర్డినేటర్ వెంకట్‌రాములు, ఉపాధ్యాయులు మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో లెక్చరర్ల నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న లెక్చరర్లు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్లు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు లెక్చరర్ వెంకట్రాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023-24 విద్యాసంవత్సరంలో తమను రెగ్యులర్‌గా చేసినప్పటి నుంచి కేవలం ఒకేసారి ఇంక్రీమెంట్ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న ప్రిన్సిపాల్స్ ఇంక్రీమెంట్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు. తమకు వెంటనే రెండో సంవత్సరం ఇంక్రీమెంట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నర్సయ్య, రాజు, శ్రావన్ కుమార్, రాజు, రవీందర్ రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి



ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మరికల్: మండలంలోని తీలేర్ గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్ర జా సంఘాల నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నేత సురేష్ మాట్లాడుతూ తీలేర్‌కు చెందిన సీపీఐ మండల కార్యదర్శి రాము తన సో దరుడితో కలిసి ఆదివారం మాజీ సర్పంచ్‌తో కౌలు భూమి విషయం చర్చిస్తుండగా, అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పరుష పదజాలంతో దూషిస్తూ వారిపైకి దూసుకొచ్చినట్లు తెలిపారు. రాత్రి దళితవాడలోకి వెళ్లి దాడి చేయడమే కాకుండా మహిళలను అసభ్యకరంగా మాట్లాడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎ దుట ఆందోళన చేసి, దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, నాగరాజ్, రాము, రాజు, దేవదాస్, కురుమన్న, లక్ష్మణ్, బాలు, ఆశన్న, మొగిలన్న, కిష్టన్నలు పాల్గొన్నారు.

భారత్‌జ్యోతి ఆచార్య శిరోమణి పురస్కారానికి ఎంపిక



భారత్ జ్యోతి ఆచార్య శిరోమణి పురస్కారం అందుకుంటున్న నారాయణ

ధన్వాడ: మండల కేంద్రంలోని శ్రీ సాయి సరస్వతి విద్యామందిర్ పాఠశాలకు చెందిన కర్సిండెంట్ మారటి నారాయణ భారత్ జ్యోతి ఆచార్య శిరోమణి పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్ అశోక స్టార్ హోటల్‌లో యంవీఎల్‌ఏ సంస్థ ఆధ్వర్యంలో 25 ఏళ్లకుపైగా పాఠశాలను నడిపిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయిలో స్థిరపడేలా చేస్తున్న వారిని గుర్తించి భారత్ జ్యోతి ఆచార్య శిరోమణి పురస్కారానికి ఎంపిక నిర్వహించారని, అందులో తెలుగు రాష్ట్రాల నుంచి 36 మందిని ఎంపిక చేశారని నారాయణ తెలిపారు. ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.విజయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

పొలాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

ఊట్కూరు: పెద్దపొర్ల నుంచి గాడుదుల వాగు వరకు పొలాలకు వెళ్లే రహదారికి మరమ్మతు లు చేపట్టాలని పెద్దపొర్ల గ్రామానికి చెందిన రైతులు ఎంపీడీఓకు సోమవారం వినతిపత్రం అందించారు. సుమారు 40 మంది రైతులు గాడుదుల వాగు శివారులో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తూ బండ్లు, ట్రాక్టర్లు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తానని ఎంపీడీఓ ధనుంజయగౌడ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, రైతులు సాలప్ప, వెంకటయ్య, రమేష్, శంకర్, లింగప్ప, తదితరులు పాల్గొన్నారు.